క్లుప్తంగా

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న చేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బేతంచెర్ల: మండల పరిధిలోని సీతారామాపురంలోని రెండు ప్రాథమిక పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులకు అదేగ్రామానికి చెందిన దాత లక్ష్మీనారాయణ సహకారంతో నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం షేక్ వజీదున్నీసా బీబీ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, నాగరాజు, శ్రీవాని, సాలమ్మ పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన ఉన్న అయ్యల చెర్వులో ట్రాక్టర్, కారు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. బేతంచెర్ల నుంచి నాపరాళ్ల లోడుతో అయ్యల చెర్వుకు వస్తున్న ట్రాక్టర్ ఫ్యాక్టరీలోకి వేళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు కర్నూలు వైపు నుంచి వస్తున్న కారును ఢీకొట్టింది. డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. కారు ముందు భాగం దెబ్బతింది.

నివాళి



పాతపేట హైస్కూల్‌లో నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : వందేమాతరం గేయ రచయిత బంకిం చంద్ర చటర్జీ జయంతిని పురస్కరించుకుని నెహ్రూనగర్ ప్రభుత్వ పాఠశాల, పాతపేట హైస్కూల్‌లో ఆయన చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వందేమాతరం గేయం స్వాతంత్ర్య ఉద్యమకారుల్లో తీసుకొచ్చిన స్ఫూర్తిని ఈ సందర్భంగా ఆయా స్కూళ్ల హెచ్‌ఎం తొగట సురేష్‌బాబు, వెంకట సుబ్బారెడ్డి వివరించారు. వందే మాతర గీతాన్ని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

బేతంచెర్ల: ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, సహాయ మలేరియా అధికారి వరప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని వడ్డెపేట, బోయపేటలో డెంగీ కేసులు నమోదు అయ్యాయనే సమాచారం మేరకు వారు కాలనీలను సందర్శించారు. కాలనీ ప్రజలకు దోమల నివారణ కు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు అవగాహన కల్పించారు. కమిషనర్ రమేష్ బాబును కలిసి మురుగు కాల్వల్లో అబెట్ ద్రావణము పిచికారీ చేయిచాలని, కాచి చల్లార్చి త్రాగేలా దండోరా వేయించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు ప్రియాంక, మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సర్వేయర్, పంబ్లర్ కోర్సులలో ఉచిత శిక్షణ

డోన్ టౌన్ : నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)సంస్థలో అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ ప్లంబర్ కోర్సుల్లో స్వల్ప కాలిక శిక్షణతోపాటు ఉద్యోగవకాశాలు కల్పించనున్నట్లు న్యాక్ కేంద్రం ఇన్‌చార్జ్ తిమోతీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాస్, ఫెయిల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. వివరాలకు 76618 28641-83286 46601 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసురత్నం

డోన్ టౌన్ : గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని చిన్నమల్కాపురంలో మండల అధ్యక్షుడు రామాంజనేయులు అధక్షతన ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ వర్కర్స్ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం కోసం నిత్యం పాటుపడుతున్న కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ26వేలు ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు శివరామ్, భాస్కర్‌రెడ్డి, నక్కి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం...పదిలం!

- వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన మాజీ సీఎం జగన్ ప్రభుత్వం
- ఆసుపత్రుల రూపురేఖలు మార్చేసిన వైనం
- రూ.22 కోట్లతో వందపడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణం
- పూర్తిస్థాయితో అందుతున్న వైద్య సేవలు



బనగానపల్లెలో రూ.22 కోట్లతో నిర్మించిన వందపడకల ఏరియా ఆసుపత్రి

బనగానపల్లె : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య, విద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యతనిచ్చింది. ప్రత్యేకించి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ప్రభుత్వాసుపత్రుల రూపురేఖలు మార్చేసింది. ప్రజారోగ్యం పదిలంగా ఉండేలా వైద్యులతోపాటు సిబ్బందిని నియమించి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించింది వైఎస్ జగన్ సర్కార్. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిచ్చారు. ప్రత్యేక చొరవతో అప్పటి సీఎం జగన్‌కు సమస్యలు వివరించి బనగానపల్లెలోని 50 పడుకల కమ్యూనిటి ఆసుపత్రిని వంద పడకల ఏరియా ఆసుపత్రిగా మార్పు చేయించారు. ఈ మేరకు రూ.22 కోట్లు మంజూరు చేయించారు. 2020 అక్టోబర్ 26న ఏరియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన జరగ్గా 2024 మార్చి 14న అప్పటి సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. వంద పడకల ఏరియా ఆసుపత్రిలో అత్యాధునిక వసతులు సమకూర్చారు. డాక్టర్లతోపాటు సిబ్బందిని వెంటనే నియమించారు. బనగానపల్లె మండలంలో పాటు అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల డోన్ నియోజకర్గ పరిధిలోని బేతంచర్ల, ప్యాపిలి, ఆళ్లగడ్డ నియోజకర్గ పరిధిలోని దొర్నిపాడు తదితర గ్రామాల ప్రజలకు వైద్య సౌకర్యాలు లభిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ తీరులోనే ప్రస్తుత టీడీపీ సర్కార్ ప్రజారోగ్యం పదిలంగా ఉండేలా వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు

వందపడకల ఆసుపత్రి భవనాన్ని జీప్లస్‌త్రీగా నిర్మించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వసతులు సమకూర్చారు. రోగుల సౌకర్యార్థం లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయించారు. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేశారు. మెడికల్ సర్జికల్ గైనిక్, ఆప్తామాలజీ, చిన్నపిల్లలు ఆర్థోపెడిక్ వంటి విభాగాల ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేయించారు. ఆపరేషన్లకు సంబంధించిన పరికరాలు ఇప్పటికే కొన్ని సమకూర్చగా ఎన్నికల కోడ్ మూలంగా అధికారులు మరికొన్ని సమకూర్చలేకపోయారు.

వందపడకల ఆసుపత్రిలో పెద్దాసుపత్రి సేవలు

స్థానిక వందపడకల ఆసుపత్రిలో కర్నూలు పెద్దాసుపత్రి సేవలు అందుతున్నాయి. గతంలో ఏ మాత్రం ఇబ్బందిగా ఉన్నా రోగులను నంద్యాల, కర్నూలు ఆసుపత్రులకు వైద్యులు రెఫర్ చేసేవారు. కొన్ని సందర్భాల్లో ఆ ఆసుపత్రులకు వెళ్లడంలో జాప్యం మూలంగా రోగులు మృతి చెందిన సందర్భాలు లేకపోలేదు. ప్రత్యేకించి గనుల కార్మికులు చాలా ఇబ్బందిపడేవారు. ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో గుండె, ఊపరితిత్తులు, నరాలు, చర్మవ్యాధులు వైద్య సేవలు సైతం అందుబాటులోకి వచ్చాయి. అత్యవసర సమయంలో రోగులకు వినియోగించేందుకు పీఎస్‌ఏ ఆక్సిజన్ ప్లాంట్‌ను కూడా అందుబాటులోకి తీసుకొవచ్చారు. ఆసుపత్రికి సంబంధించి 84 పోస్టులు మంజూరవ్వగా ఏడు మంది స్టాఫ్‌నర్సులు మినహా మిగిలిన సిబ్బంది మొత్తం విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో కమ్యునిటీ వైద్యశాలలో ప్రతిరోజు ఓపీ రోగుల సంఖ్య 300–400 ఉండగా ప్రస్తుతం 600–700 వరకు ఉన్నారు. ఇన్‌పేషెంట్స్ సంఖ్య కూడా 70–80 వరకు ఉన్నట్లు సమాచారం.

ఏరియా ఆసుపత్రిలో ఉద్యోగుల వివరాలు

పోస్టులు	సంఖ్య
సీఎస్ఆర్ఎంఓ	1
సివిల్ సర్జన్ల	5
సివిల్ అసిస్టెంట్ సర్జన్లు	12
స్టాఫ్‌నర్సులు	24
నర్సింగ్ అర్డర్లీ	12
హెడ్‌నర్సులు	4
సినియర్ అసిస్టెంట్స్	2
ఫార్మసిస్ట్ గ్రేడ్ 2	4
ల్యాబ్‌టెక్నీషియన్స్	3
ఇతర పోస్టులు	17

పూర్తిస్థాయిలో వైద్య సేవలు



వంద పడకల ఏరియా ఆసుపత్రిలో రోగులు పూర్తిస్థాయిలో వైద్య సేవలు పొందుతున్నారు. ఓపీ రోగుల సంఖ్య బాగా పెరిగింది. వైద్యులు, మందుల కొరత లేదు. ఏడుగురు స్టాఫ్ నర్సులు మాత్రం రావాల్సి ఉంది. ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్లకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుతున్నాయి. చిన్నపిల్లలు, ఆర్థోపెడిక్ థియేటర్లకు సంబంధించి కొన్ని ఆపరేషన్ పరికారాలు రావాల్సి ఉంది. ప్రస్తుతం చిన్నచిన్న ఆపరేషన్లు చేస్తున్నాం.

– డాక్టర్ సుజాత, సివిల్ సర్జన్, ఏరియా ఆసుపత్రి బనగానపల్లె



ఓపీ విభాగం వద్ద భారీ సంఖ్యలో ఉన్న రోగులు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



ఇన్‌పేషెంట్ వార్డులో రోగులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణయ్య

బనగానపల్లె రూరల్ : వర్షా కాలంలో మూగజీవాలకు సోకే సీజనల్ వ్యాధులపై పశువైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకట రమణయ్య సూచించారు. గురువారం స్థానిక పశువైద్యశాలలో ఏడీఏ మారుతిసకారామ్ ఆధ్వర్యంలో అవుకు, బనగానపల్లె మండలాల్లో విధులు నిర్వహించే పశువైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై పశు, జీవాల పోషకులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. వర్షా కాలంలో పశువులు ఎదకు రావడం జరుగుతుందని, రైతులు జాగ్రత్తలు పాటించేలా గ్రామీణ పశువైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలని, పశుగ్రాస సమస్య రాకుండా పొలాల గట్లు, షెడ్ల పరిసరాల్లో గడ్డి పెంపకం చేపట్టేలా రైతులకు సూచలను ఇవ్వాలన్నారు. గొర్రెల్లో మేకల్లో వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, ముందస్తు నివారణ చర్యలను ఏడీఈ మారుతిసకారామ్ వివరించారు. కార్యక్రమంలో పశువైద్యులు బ్రహ్మానందరెడ్డి, రామ్‌కుమార్‌రెడ్డి, చిన్నబాబు, శ్రీకాంత్‌రెడ్డి, మారుతిదేవి, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

29న నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం

బేతంచెర్ల: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో ఈనెల 29న ఉదయం 11 గంటలకు చైర్మన్ చలం రెడ్డి అధ్యక్షతన నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమేష్ బాబు గురువారం తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు సమావేశానికి తప్పక హాజరు కావాలని సూచించారు.

అధిక ధరలకు విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు



విత్తన స్టాక్ రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఏఓ నిరంజన్

కోవెలకుంట్ల: రైతులకు కావాల్సిన విత్తనాలను ఎంఆర్‌పీకంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ నిరంజన్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేసి విత్తన స్టాక్, అందుకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ డీలర్లు విత్తనాల వివరాలను స్టాక్‌బోర్డులో ప్రదర్శించాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరిగా రసీదులు ఇవ్వాలన్నారు. స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. లేబుల్‌లేని, లూజు సీడ్‌ను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వివిధ షాపుల్లోని మొక్కజొన్న, కంది విత్తన శ్యాంపిల్స్‌ను సేకరించి నాణ్యత పరీక్షలక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.

వైభవంగా మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహా స్వామి ఆలయంలో గురువారం మహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు, వేదపండితులు అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన నంద్యాల రహదారిలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయ పదవ వార్షికోత్సవం వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితిభ్యులు మల్లు హుసేన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, చిన్ని కృష్ణ, నాగేశ్వర్‌రెడ్డి, మోహన్,రాఘవ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం స్వామి వారికి పంచామృత అభిశేకం, మహా మంగళహారతి నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తిని కొలువుంచి పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు.

మంత్రి బీసీ దృష్టికి కళాశాల సమస్యలు



బీసీ జనార్దన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాజీక సత్యప్రపూర్ణ, అధ్యాపకులు

బనగానపల్లె రూరల్ : ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజీక సత్యప్రపూర్ణ, అధ్యాపకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్ వినతి పత్రం అందజేశారు. కళాశాల బోరు ఇంకిపోవడంతో మంచినీటి కొరత ఉందని ఆమె మంత్రి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వైటీ శ్రీధర్‌రెడ్డి, వెలుగు సిబ్బంది మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

30 నుంచి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పర్యటన

బనగానపల్లె : ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఈ నెల 30 నుంచి బనగానపల్లె నియోజకవర్గంలో పర్యటిస్తారని టీడీపీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. 30వ తేదీన కోవెలకుంట్ల మండలం, జూలై 2న సంజామల, 3న కొలిమిగుండ్ల, 4న బనగానపల్లె, 5వ తేదీన అవుకు మండలంలో పర్యటిస్తారు. ఆయా మండలాలలో టీడీపీ నాయకులతో మంత్రి సమావేశం కానున్నారు.

ప్రజలకు శుద్ధమైన నీటిని అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జయరామ్

డోన్ టౌన్ : ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే స్వచ్ఛమైన నీరు అందించినప్పుడే సాధ్యమని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలోని సమావేశ భవనంలో గురువారం పట్టణంలోని వాటర్ ప్లాంట్ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. మినరల్ వాటర్ శుభ్రంగా ఉండాలని, లేకపోతే ప్లాంట్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా ప్రతి ప్లాంట్‌లో క్లీనికల్ ల్యాబ్ రిఫోర్టు తప్పని సరిగా ఉండాలని, ఐఎస్ఐ స్టాండర్డ్ ప్రమాణాలు పాటించాలన్నారు. నిబంధనల పాటించకుంటే వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాటర్ ప్లాంట్‌లను శానిటరీ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు.

అప్రమత్తంగా ఉండాలి

డోన్ : మలేరియా, డెంగీ, డయేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. స్థానిక 2వ వార్డులో గురువారం డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషాలతో కలిసి కమిషనర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా కాలనీల్లో కమిషనర్ పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడారు. ఇళ్ల ఎదుట తొట్లలోని నీటి నిల్వలను పరిశీలించారు. ఎక్కువ కాలం నీటి నిల్వ మూలంగా దోమలు వ్యాపించి అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలను హెచ్చరించారు. నీటిని నిల్వ ఉంచే తొట్లు, బకెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు డ్రైనేజీలు కూడా శుభ్రంగా ఉండేందుకు మున్సిపల్ సిబ్బంది సహకారం తీసుకోవాలని స్థానికులకు సూచించారు. ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

- డీఈఓ సుధాకర్ రెడ్డి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్ రెడ్డి

అవుకు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా విరివిగా అడ్మిషన్లు చేపట్టాలని డీఈఓ సుధాకర్ రెడ్డి సూచించారు. ఆ దిశగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని, అడ్మిషన్‌లలో నిర్లక్ష్యం వహిస్తే సహించమని హెచ్చరించారు. మండల కేంద్రం అవుకులోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కిట్లు స్టాక్ పాయింట్‌ను డీఈఓ తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలల్లో 6వ తరగతి అడ్మిషన్ల రికార్డును పరిశీలించారు. అడ్మిషన్లు పూర్తి తక్కువగా ఉన్నాయని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి అడ్మిషన్లు పెరిగేలా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పాఠశాలల్లో ఐఎఫ్‌ఎల్ ప్యానల్ ద్వారా జరుగుతున్న బోధన కార్యక్రమంలో పిల్లలు పాల్గొనేలా చేసి వాటికి సంబంధించిన ఫొటోస్‌ను విద్యార్థుల తల్లిదండ్రులకు చూపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యా బోధన, ప్రైవేటు స్కూళ్ల తీరు వ్యత్యాసాన్ని తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. అనంతరం కేజీబీవి పాఠశాలను సందర్శించారు. అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. బిల్లుల అప్‌లోడ్, ఖర్చులపై ఎస్ఓకు సూచనలు చేశారు. పనులు త్వరగా పూర్తి చేయించాలని ఆదేశించారు. అలాగే నూతన బోధన విధానాలను పాటిస్తూ విద్యార్థులకు అర్థమయ్యేలా విశదీకరించాలని, పేదల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అలెస్కో కోఆర్డినేటర్ రఘురామిరెడ్డి, ఎంఈఓ శ్రీధర్ రావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంక ఆక్రమణపై చర్యలు తీసుకోండి

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామంలో వంక ఆక్రమణకు గురైందని పెద్దపాయి గ్రామానికి చెందిన యాగంటి రెడ్డి గురువారం తహసీల్దార్ ప్రతాప్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. చంద్రపల్లి రెవెన్యూ పరిధిలో తనకు 6-65 ఎకరాల పొలం ఉందని, అదేవిధంగా తన పొలం పక్కనే పెద్దపాయికి చెందిన కంబగిరి రెడ్డి, రంగస్వామి పొలాలు కూడా ఉన్నాయని తెలిపాడు. వీరి పొలాల మధ్యలో ఉన్న వంకను వీరిద్దరూ ఆక్రమించడంతో వంక పూర్తిగా కుదించుకుపోయిందన్నారు. దీంతో వర్షాలు వస్తే వరద నీరు తన పొలంలోకి వచ్చి పొలం కోతకు గురవుతుందని బాధితుడు వాపోయాడు. తమ పొలాలను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు వంకను గతంలో ఉన్నట్లు వెడల్పు చేయాలని కోరాగా స్పందించిన తహసీల్దార్ సర్వే చేయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రైతులతో సమావేశం

డోన్ రూరల్ : మండల పరిధిలోని వెంకటాపురం తుమ్మల చెరువు వద్ద గురువారం ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ రైతులకు సమావేశమయ్యారు. ఆయకట్టుకు సాగునీటి విడుదల విషయాలపై ఏఈ చర్చించారు. త్వరలోనే నీటిని విడుదల చేసే ప్రయత్నం చేస్తామని రైతులకు తెలిపారు. సమావేశంలో వీఆర్‌ఓ కృష్ణారెడ్డి, మనోహర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డోన్ టౌన్ : వర్షా కాలంలో సోకే వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సునిత తెలిపారు. పాతపేట జెడ్పీ హైస్కూల్లో గురువారం సీజనల్ వ్యాధుల నివారణపై వైద్య సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కలుషిత నీటి మూలంగా డయేరియా, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలుతాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సచివాలయ ఉద్యోగుల ఇష్టారాజ్యం!

కొలిమిగుండ్ల: గ్రామ స్థాయిలోనే ప్రజలకు సత్వర సేవలు అందించాలనే సదుద్దేశంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించింది. ఇటీవల టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో సచివాలయ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయాలపై పర్యవేక్షణ లేక పోవడంతో విధులకు ఎప్పుడు వస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది ప్రజలు వాపోతున్నారు. కొంత మంది ఉద్యోగులు సెలవులు పెట్టకుండానే విహారయాత్రలకు వెళ్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో 16 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. మండల కేంద్రానికి దూరంగా ఉన్న సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎంపీడీఓ సాయికృష్ణ గ్రూప్–1 పరీక్షల నిమిత్తం ఉన్నతాధికారుల అనుమతితో ప్రిపేర్ అవుతున్నారు. అత్యవసర పనుల సమయంలో కార్యాలయానికి వచ్చి పోతుంటారు. జూలై 1వ తేది నుంచి మూడు నెలల పాటు సెలవు పెట్టనున్నారు. వివిధ రకాల పనుల నిమ్తితం సచివాలయాలకు వెళ్తున్న ప్రజలకు అందుబాటులో ఉద్యోగులు లేక పోవడంతో అవస్థలు పడుతున్నారు.

నూతన వ్యవసాయ పద్ధతులు వివరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

డోన్ రూరల్ : ఆర్‌బీకే సిబ్బంది రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులను వివరించాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ సూచించారు. పట్టణం సమీపంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో డోన్ డివిజన్ పరిధిలోని ఆర్‌బీకే సిబ్బందికి యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల ఆరోగ్యం కోసం తప్పకుండా పశువుల ఎరవులను వాడాలని, రసాయిన ఎరువులను తగ్గించాలని సూచించారు. అలాగే ప్రతి మూడేళ్ల కోసారి మట్టి పరిక్షలు చేయించి, వాటి ఆధారంగా ఎరువులు వాడేలా, సాగు ఖర్చులు తగ్గించుకొనేలా రైతులను చైతన్య పరచాలన్నారు. అదే విధంగా కలుపు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, ఆదిఆరాయణ, రవిగౌడ్, ఏఓలు అబ్దుల్ షఫి, రాజేష్, కిరిణ్ కుమార్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శివశంకరుడు

బనగానపల్లె రూరల్ : ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని, అప్పుడే వ్యాధులు సోకవని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. గురువారం పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న బీసీ బాలుర, జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్ వసతి గృహాలను ఆయన సందర్శించారు. విద్యార్థిని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరం మేరకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివశంకరుడు మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు, తర్వాత చేతుల శుభ్రత పాటించాలని సూచించారు. రాత్రి దోమతెరాలను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. దగ్గు జ్వరం తలనొప్పి తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అలాగే భూపాల్‌నగర్ కాలనీలో చేపట్టిన వయో వృద్ధులకు బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీ రమేష్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.